


23న ఎపిపిఎస్‌సి గ్రూప్‌2 మెయిన్స్ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 23న జరగనున్న ఎపిపిఎస్‌సి గ్రూప్ 2 మెయిన్స్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జేసీ శుభం బన్సల్, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీలతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు అవసరమైన స్టేషనరీని చెక్‌లిస్ట్ ప్రకారం సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. 13పరీక్షా కేంద్రాల్లో సిసి టివి కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. గ్రూప్ -2 పరీక్షలు పేపర్ -1 ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, పేపర్ -2 మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 05.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పేపర్ -1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు. డిఆర్‌ఒ నరసింహులు పాల్గొన్నారు.

నేడు వేమన విజ్ఞాన కేంద్రంలో...

'శ్రమైక' గీతాల అశోక్ 'తేజ'ం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ

సుద్దాల అశోక్‌తేజ సాహిత్యమంటే అభ్యుదయ, పుస్తకప్రియులు చెవి కోసుకుంటారనడంలో సందేహం లేదు. శ్రమైక గీతాల సౌందర్య తేజం ఆయనది.. ఆయన రచించిన 'శ్రమకావ్యం'ను తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సుద్దాల అశోక్‌తేజ స్వయంగా గానం చేయనున్నారు. తెలుగు సినిమా పాటకు జనం భాషను అద్దిన పాటగాడు, పదపదాన ప్రజాదృక్పథం కనబరచిన ప్రగతిశీల భావుకుడు. తెలుగు సినిమా కథ, పాటల రచయితగా మూడువేల పాటలు రాశారు. మరో 2,500 వరకూ సాహిత్యపరమైన జానపద పాటలకు జీవం పోశారు. 'రగరగ సూరీడై రగలాలి కొడుకో.. రగలాలి కొడుకో' అనే పాట ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో కొమురం భీమ్ ధీరత్వానికి అద్దం పడుతుంది. అశోక్‌తేజ రాసిన పాటలన్నీ ఒక ఎత్తు. మానవ జీవన పరిణామ క్రమంలో శ్రమపాత్రను గుర్తుచేస్తూ ఆయన చెక్కిన 'శ్రమకావ్యం' మరో ఎత్తు. స్వేద్యం విలువ చాటే 'శ్రమకావ్యం' కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని కన్వీనర్ ఎం.నాగార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రంలోని పలవలి రామకృష్ణారెడ్డి సభా ప్రాంగణం ఏసీ హాలులో సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.

నేడు తిరుపతికి సుద్దాల అశోక్‌తేజ రాక

ప్రముఖ సినీ గేయ రచయిత, కవి, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ శుక్రవారం తిరుపతికి రానున్నారు. 'శ్రమకావ్యం'పై సుద్దాల గానం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం గురువారం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

అభ్యుదయ, పుస్తకప్రియులకు ఆహ్వానం

ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజతో పాటు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జాలేశ్వరరావు, రోజారమణి, సాయిలక్ష్మి, డాక్టర్ రవీంద్రకుమార్, పంచముఖేశ్వరరావు, చిరంజీవి, రఫీ, డాక్టర్ చంద్రకిషోర్, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.



వరి పంటకు ఊరికో రేటు

దళారులదే ధర

ప్రజాశక్తి - వాకాడు(చిట్టమూరు)

తూర్పున వరి కోతలు మొదలయ్యాయి. తుపాన్లను తట్టుకుని రైతులు ఆరుగాలం కష్టపడి వరి పంటను పండించారు. అయితే పంట పండించడం కంటే అమ్ముకోవడం చాలా కష్టంగా ఉందన్నది అన్నదాతల ఆవేదన. దళారులు కుమ్మక్కయ్యి ఊరుకో రేటు చెబుతున్నారు. ఆ ధర సైతం రోజుకు వంద రూపాయల చొప్పున తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరికొందరు వ్యాపారులు, మిల్లర్లు రైతులకు పురుగు మందులు, రసాయనాలు అప్పుగా ఇచ్చి వారి పంటను వేరే వారికి అమ్మనీకుండా తక్కువ రేటుకు కొనుగోలు చేస్తూ చెప్పిన ధరను శాసిస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో 75 కేజీల బస్తా 21వేలపైనే ధర పలకడం గమనార్హం.

బీపీటీలు వారం రోజుల క్రితం పుట్టి (860 కేజీలు) 18,400 ధర ఉంది. అదే దళారులు బుధవారం 18వేలకు కొనుగోలు చేశారు. వేరే వాళ్లకు ఫోన్ చేసినా 'మీ ఊళ్లో 18వేలే ధర ఉంది.. పంట బాగుంటే అదే ధరకు కొనుగోలు చేస్తాం' అని చెబుతుండటం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో 17,900 రూపాయలకు కొంటున్నారు. ఇంకా ధర తగ్గిపోతుందేమోనని రైతులు పచ్చ గింజ సైతం కోసేస్తున్నారు. చిన్నసన్నకారు రైతులు పంట కోసేసి దళారులు ఎప్పుడు కొనుగోలు చేస్తారా? అని ధాన్యం వద్ద కాపలా కాస్తూ ఎదురుచూస్తున్నారు.

రైతులు ఎవరూ మా వద్దకు రాలేదు

సూచేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి, చిట్టమూరు


మండలంలో దాదాపు 22వేల ఎకరాలు సాగు చేశారు. అందులో 80శాతం బిపిటి-5204, కెఎన్‌ఎం-1638, ఐదు శాతం ఆర్‌ఎన్‌ఆర్ వేశారు. ప్రస్తుతం వరి పంట పుట్టి రూ.19700 ధర పలుకుతోంది. ఈ లెక్కన కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అయితే రైతులు ఎవరూ మా వద్దకు రాలేదు. ధర నియంత్రణ విషయం పౌరసరఫరాల డిప్యూటీ తాసీల్దార్ పరిధిలో ఉంటుంది. సిఎస్‌డిటి మల్లికార్జున్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎటువంటి అనుమతి రాలేదని తెలిపారు.

అమ్ముకోవడం కష్టంగా ఉంది : వాటంబేటి నాగయ్య, కొక్కిపాలెం, ముత్తుకూరు గున్నయ్య, పల్లంపర్తి





పంటను పండించడం కన్నా అమ్ముకోవడం చాలా కష్టంగా ఉంది. ఎకరా పంట సాగు చేయాలంటే కౌలుతో కలిపి 35-40వేలు ధర పలుకుతోంది. పొలం బాగా పండితే మూడు పుట్లు పండుతాయి. రెండు పుట్లు పెట్టుబడికే సరిపోతుంది. బాగా పండకపోతే ఒక పుట్టి వడ్లు కూడా మిగిలే పరిస్థితి లేదు.





డిప్యూటీ మేయర్లదే హవా... ఆర్‌సి మునికృష్ణ ప్రమాణ స్వీకారం , తాత్కాలిక మేయర్‌గా ముద్రనారాయణ

రూ.252 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

- డిసిపి అవమానించారని మేయర్ డాక్టర్ శిరీష వాకౌట్
- డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కార్పొరేషన్ బడ్జెట్ రూ.272 కోట్లతో ఆమోదించారు. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశంతో పాటు, బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్‌వి సెనెట్ హాల్లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్‌సి మునికృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, వైసిపి ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, టిడిపి, వైసిపి, జనసేన కార్పొరేటర్లు హాజరయ్యారు.

మేయర్ శిరీష వాకౌట్

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసిపి కార్పొరేటర్ శేఖర్‌రెడ్డికి చెందిన భవనాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేసే సమయంలో తాను ధర్నా చేస్తున్నప్పటికీ తిరుపతి డిప్యూటీ సిటీ ప్లానింగ్ అధికారి మహాపాత్ర తనను అవమానించారని, మేయర్ అనే గౌరవం ఇవ్వకుండా, మహిళని చూడకుండా కఠినంగా వ్యవహరించారని, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని కమిషనర్ మౌర్యను మేయర్ శిరీష ప్రశ్నించారు. తిరుపతి డిప్యూటీ సిటీ ప్లానింగ్ అధికారి రెగ్యులర్‌పోస్టు లేకపోయినా ఇక్కడి అవసరాల కోసం డిప్యుటేషన్ పద్ధతిలో డిసిపి మహాపాత్రకు అవకాశం కల్పించామని, కార్పొరేషన్ ద్వారా జీతం ఇవ్వడానికి కౌన్సిల్ తరపున ఆమోదిస్తున్నానని, అయితే ఆయన మహిళల పట్ల వ్యవహరించిన తీరు బాగోలేదని అన్నారు. కొంతమంది వైసిపి కార్పొరేటర్లతో పాటు, ఇతర కార్పొరేటర్లు కూడా మేయర్ డాక్టర్ శిరీషకు మద్దతుగా మాట్లాడారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మహాపాత్ర ఎందుకు అలా చేశారో ఆయన ద్వారా రాతపూర్వకంగా వివరణ తీసుకుంటానని చెబుతూ, మేయర్‌కు కమిషనర్ క్షమాపణలు చెప్పారు. డిసిపి మహాపాత్ర మాట్లాడుతూ ఆ సమయంలో గందరగోళంగా ఉండటం వల్ల తనకు తెలుగు సరిగ్గా రాదని, అందువల్లే మేయర్ డాక్టర్ శిరీష గురించి తాను పట్టించుకోలేదని క్షమాపణ చెప్పారు. అయితే మేయర్ డాక్టర్ శిరీష సంతృప్తి పడక కౌన్సిల్ సమావేశం నుంచి బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి మధ్యలోనే వెళ్లిపోయారు. ఆమెతో పాటు 15 మంది వైసిపి కార్పొరేటర్లు బాయ్‌కాట్ చేశారు.

తాత్కాలిక మేయర్‌గా ముద్రనారాయణ

కౌన్సిల్ సగంలోనే మేయర్ డాక్టర్ శిరీష బాయికాట్ చేయడంతో, బడ్జెట్, అజెండాలోని 42 అంశాలను చర్చించాల్సి ఉండగా కోరం పరిశీలించారు. కోరం ఉండడంతో తాత్కాలిక మేయర్‌గా డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ వ్యవహరించాలని కోరారు. ముద్రనారాయణ సమావేశాన్ని నిర్వహించారు. రూ.272 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించారు.

ఆర్‌సి మునికృష్ణ ప్రమాణ స్వీకారం

కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఆర్‌సి మునికృష్ణ కౌన్సిల్లో ప్రమాణ స్వీకారం చేశారు. ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆయనను అభినందించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, నేతలు పులిగోరు మురళీకృష్ణారెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్‌వర్మ, నరసింహాయాదవ్ అభినందనలు తెలిపారు.

కమిషనర్‌కు అభినందనలు

తిరుపతినగరాభివృద్ధికి కృషి చేస్తున్న కమిషనర్ మౌర్యను ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు అభినందించారు. స్కావెంజర్ కాలనీలో నివాసం ఉంటున్న పారిశుధ్య కార్మికుల ఇళ్లకు అందమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారని కొనియాడారు.నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శ్రీనివాస సేతుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని గరుడ వారధిగా మారుస్తూ తిరుపతి కౌన్సిల్ ఆమోదించింది.


ఎదురు తిరిగితే కూల్చేస్తారా..!

'కూటమి' తీరుపై చక్రాల ఉషా ఆవేదన

రాత్రికి రాత్రే 'అధికార పార్టీ' నోటీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైసిపి హయాంలో టిడిపి ప్రతిపక్షంలో ఉన్నపుడు చక్రం తిప్పిన 'చక్రాల ఉష'కు 'కూటమి' ప్రభుత్వంలో చుక్కెదురయ్యింది.. అధికారపార్టీ నేతకు ఎదురు తిరిగినందుకు మున్సిపల్ అధికారులు తన భర్తకు చెందిన లైనర్స్ దుకాణాన్ని కూల్చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆమె వాపోయారు. బుధవారం నారా లోకేష్ తిరుపతి పర్యటనలో తన గోడు విన్నవించుకునే ప్రయత్నం చేసినా వీలుకాలేదు. ఈ సందర్భంగా అధికార పార్టీ నేతకు, తనకు వాగ్వాదం చోటు చేసుకున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రే ఈ దారుణానికి ఒడిగట్టారని ఆమె వాపోయారు. ఆ దుకాణం అక్రమంగా నిర్మించుకున్నారనీ, వారం రోజుల్లో తొలగించాలంటూ జనవరి 13న నోటీసు జారీ చేసినట్లుగా మున్సిపల్ అధికారులు తెలిపారన్నారు. కాగా ఆ నోటీసు అధికార పార్టీ నేతతో వాగ్వాదం చోటు చేసుకున్న బుధవారం రోజు రాత్రే హుటా హుటిన ఎందుకు తమకు అందజేశారో చెప్పాలని ప్రశ్నించారు.



తన భర్తకు తండ్రి అయిన చక్రాల నాగయ్య గత 40 ఏళ్లుగా నాగులగుంట సర్వే నెం.261, ఇంటి నెం.6-605లో ట్రాక్టర్ లైనర్స్ దుకాణం నడుపుతున్నారు. దుకాణం నిర్వహణకు పన్ను, కరెంట్ బిల్లు చెల్లిస్తున్నారు. అయితే గత నలభై ఏళ్లుగా అక్రమంగా కనిపించని తమ దుకాణం ఇప్పుడెలా కనిపించిందో అర్థం కావడం లేదని వాపోయారు. మున్సిపల్ నిబంధనలకు లోబడే తన భర్త దుకాణాన్ని నిర్వహిస్తున్నారనీ, ఆ దుకాణం వల్ల వాహన రాకపోకలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పారు. అయితే మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్న దుకాణాలకు నోటీసులివ్వకుండా సమస్యే లేని తన దుకాణానికి మున్సిపల్ అధికారులు నోటీసులివ్వడం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. ఇదంతా కక్ష పూరితంగా జరుగుతోందనీ, మున్సిపల్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తానని ఆమె తెలిపారు. ఇదిలా ఉంటే శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారుల తీరు నానాటికి తీసి కట్టుగా మారుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ నేతలు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పారదర్శకంగా వ్యవహరించాల్సిన అధికారులు రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు.

గూడూరులో...



అంకెల గారడీతో రాష్ట్రానికి అన్యాయం

కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్, ఏర్పేడు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. టవర్‌క్లాక్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ నాయకులు జోగి శివకుమార్, ప్రభాకర్ మాట్లాడుతూ అంకెల గారడీతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, రాష్ట్ర విభజన సమయంలో చేసిన వాగ్దానాల అమలుకు ఇప్పటివరకూ నిధులు కేటాయించలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారన్నారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న టిడిపి, జనసేన ఎంపిలు బిజెపిని ప్రశ్నించడంలో విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, పామంజి మణి, చెంగయ్య, సురేష్,



పుట్టా శంకరయ్య, గుర్రం రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, చంద్రయ్య, వెంకటప్ప, శశి, కాలేషా, సునీల్, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

- **ఏర్పేడులో**.. మండల కేంద్రంలో కెవిపిఎస్ నాయకులు సెల్వరాజ్, సిపిఎం నాయకులు కరీముల్లా, రైతుసంఘం నాయకులు రంగయ్య నేతృత్వంలో నిరసన తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినప్పటికీ ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమకు నిధులు కేటాయించలేదన్నారు.

ఖాళీ టిన్‌ల విక్రయానికి 27న సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల : శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్నులు 2026, మార్చి 31వ తేదీ వరకు సేకరించవచ్చు. తిరుపతిలోని హరేకష్ణ రోడ్డులో గల మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఫిబ్రవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయవలెను. ఇతర వివరాలకు మార్కెటింగ్ (వేలం) కార్యాలయాన్ని 0877-2264429 సంప్రదించాలని పేర్కొంది.

విమానాశ్రయ విస్తరణ రన్‌వే ప్రారంభం

ప్రజాశక్తి - ఏర్పేడు

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో విస్తరించిన రన్‌వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, డాప్లర్ వెరీ హై ఫ్రీక్వెన్సీ ఓమ్ని-డైరెక్షనల్ రేంజ్, డిస్టెన్స్ మెజర్‌మెంట్ ఎక్విప్‌మెంట్ వంటి ఆధునిక నావిగేషన్ పరికరాల ఏర్పాటు ద్వారా విమానాశ్రయ సేవలు మరింత మెరుగ్గా మారతాయని తెలిపారు. ముఖ్యంగా అధునాతన ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ వ్యవస్థ ద్వారా విమాన సర్వీసుల రాకపోకలు మరింత సులభంగా, సురక్షితంగా మారనున్నాయన్నారు.

ఎస్పీని కలిసిన కిరణ్ రాయల్ బాధితురాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తనను మోసం చేసిన జనసేన పార్టీ ఇన్చార్జి కిరణ్ రాయల్‌ను వెంటనే అరెస్టు చేయాలని బాధితురాలు లక్ష్మి గురువారం ఎస్పీని మరోసారి కలిసి విన్నవించారు. ఎస్పీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ కిరణ్ రాయల్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, కుటుంబ సభ్యులకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు.తనకు న్యాయం చేసి, కిరణ్‌రాయల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు.కిరణ్‌రాయల్‌పై చీటింగ్ కేసు మాత్రమే పెట్టారని, తనను బెదిరించి చంపేస్తానని హెచ్చరించిన నేపథ్యంలో అందుకు తగినట్లు సెక్షన్లు నమోదు చేయలేదన్నారు.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనుల్లో పురోగతి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పిఎంజి ప్రాజెక్టు పనుల పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండికలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వివరిస్తూ తిరుపతి జిల్లాలో నడికుడి -శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైను కు సంబంధించిన పెండింగ్ లో ఉన్న పట్టా,



డికేటి భూములకు సంబంధించిన అవార్డు పాసింగ్ పూర్తి చేసామని తెలిపారు. సంబంధిత బిల్లులు సీఎఫ్ఎంఎస్ నందు అప్లోడ్ కు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచిస్తూ, పెండింగ్ నిధులపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు కలెక్టరేట్ భూ సేకరణ డిటి భాస్కర్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు వేళాయే..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21న భక్తకన్నప్ప ధ్వజారోహణం, 22న శ్రీకాళహస్తీశ్వరస్వామి ధ్వజారోహణం, 23న 2వ తిరునాళ్లు, 24న మూడవ తిరునాళ్లు, 25న నాలుగవ తిరునాళ్లు, 26న మహాశివరాత్రి, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న ఆది దంపతుల కల్యాణం, మార్చి 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న పల్లకీసేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకం నిర్వహించనున్నారు. ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండటానికి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఇప్పటికే తిరుపతి కలెక్టరు డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం రాజగోపురం వెనుక వైపున కళా ప్రాంగణం సిద్ధమైంది. స్వామి అమ్మవార్ల సేవలకు ఆలయ అధికారులు వాహనాలు సిద్ధం చేశారు.

గుడిమల్లం ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి -ఏర్పేడు

ఏర్పేడు మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నందువలన ఏపీ ఐటి, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్‌కు ఆహ్వాన పత్రికను ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు అందించి ఆహ్వానించారు. రెండు రోజుల క్రితం దేవాలయాల కన్వెన్షన్ కార్యక్రమానికి తొలిరోజు హాజరైన సిఎం చంద్రబాబునాయుడును కలిసి ఆహ్వానం పలికారు.

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి -రేణిగుంట మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ కాళహస్తిలో జరిగే శివపార్వతుల కళ్యాణ మహోత్సవం రోజున జరిగే వివాహాలలో బాల్యవివాహాలు జరగకుండా నియంత్రించాలన్న సంకల్పంతో గురువారం ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం గుత్తివారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై ర్యాలీ, సమావేశం ఏర్పాటు చేశారు. ర్యాలీలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్లకు తెలియజేయాలని కోరారు. ప్రగతి సంస్థ ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజుష, పాపా నాయుడుపేట క్లస్టర్ కోఆర్డినేటర్ సుభాష్ చంద్రబోస్, సి ఓ రాజేశ్వరి, సురేష్ పాల్గొన్నారు.

'గంగాపార్వతి' ఆలయానికి తాత్కాలిక కమిటీ

సూళ్లూరుపేట : శ్రీ గంగా పార్వతి సామెత నాగేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తాత్కాలిక ఉత్సవ కమిటీని గురువారం నియమించారు. ఎంఎల్‌ఎ నెలవల విజయశ్రీ ఉత్సవ కమిటీ పేర్లను ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ముప్పాళ్ల శ్రీహరి రెడ్డి ప్రధాన సభ్యునిగా, ఆయనతో పాటు నలజాం రాము, మాముడూరు శాంతి, మాటిరెడ్డి సాయికిరణ్, పట్టుపల్లి రాజశేఖర్, చెన్నం శ్రీనివాసులు ఉన్నారు. బిజెపి కన్వీనర్ తాడిపత్తి ఆదినారాయణ రెడ్డి సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.



టిటిడి బోర్డు మెంబర్ నరేష్‌కుమార్‌ను తొలగించాలి

ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్న ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టీటీడీ ఉద్యోగి బాలాజీపై దురుసుగా ప్రవర్తించిన బోర్డు మెంబర్ నరేష్ కుమార్‌ను తొలగించాలంటూ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. పరిపాలనా భవనం ఎదుట టిటిడి ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా ఉద్దేశించి ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ అడిషనల్ ఈవో సమన్వయం పాటించాలని కోరారని, ఆయన మాటకు గౌరవమిస్తూ రెండు రోజులు మౌన



ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఆ తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు గోల్కొండ వెంకటేష్, మల్లారపు నాగర్జున, గుణశేఖర్, ప్రసాద్ రావు, చీర్ల కిరణ్, ఆంజనేయులు, వెంకటరమణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దాసు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు. బోర్డు మెంబర్ నరేష్‌కుమార్ నోటికొచ్చినట్లు అసభ్యకరంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని టౌన్‌బ్యాంక్ వైస్‌ఛైర్మన్ వాసుయాదవ్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ తెలిపారు.

అరణియార్ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

స్పందనకు వందనం

'ఆటకెక్కిన పిచ్చాటూరు అరణియార్ అభివృద్ధి' - ప్రజాశక్తి వార్తకు స్పందించిన జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్ రాజు

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా): పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టుపై జరుగుతున్న పర్యాటక అభివృద్ధి, ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్ రాజు స్థానిక అధికారులకు సూచించారు. అరణియార్ ఆధునికీకరణ రూ.35 కోట్లు నిధులతో పనులు ప్రారంభమై ఏడు సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడం, గత నెలలో 16వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో ఆటకెక్కిన పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధి పనులు అంటూ వార్తగా రావడంతో జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం పనులు పూర్తి చేయాలని వినతి పత్రం సమర్పించారు. దీనితో పాటు తుడా నిధులు రూ.1.85 కోట్లతో జరుగుతున్న టూరిజం పనులు సైతం వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ నేపథ్యంలో పిచ్చాటూరు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రాజు గురువారం అరణియార్ ప్రాజెక్టును సందర్శించి రూ.35 కోట్ల జైకా నిధులతో చేపడుతున్న ఆధునికీకరణ పనులు జాప్యంపై ఆరా తీశారు. అక్కడ నుండి పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించి అక్కడే ఉన్న ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్, డీఈ రామచంద్ర మూర్తి, ఏఈలు లోకేశ్వర్ రెడ్డి, మురళీ మోహన్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు, ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు.



ప్రజాశక్తిలో వచ్చిన కథనం





పర్యావరణంపై కళాజాత


కళాజాతలో పాల్గొన్న కళాకారులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఏర్పేడు: ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బ్రై బెంగళూరు, బ్రాహ్మి వారి ఆర్థిక సహకారంతో నాగేశ్వరరావు నాట్యమండలి కళ్యాంచం వారిచే ఏర్పేడు మండలం, పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిందేపల్లి, రాజులపాలెం ఎస్సీ కాలనీల్లో పర్యావరణం, బాలికల విద్య, పాఠశాల నమోదు అంశాలకు సంబంధించి గురువారం కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహదేవయ్య, గంగులమ్మ, సిడిపిఒ కృష్ణమూర్తి, ఎంఈఓ 2 దయాకర్, ప్రగతి సంస్థ సిబ్బంది శిరీష, వెంకటేష్, మురగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నూకతోటి రాజేష్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం, బియన్ కండ్రిగ మండలంలో వైసీపీ మండల అధ్యక్షులు కొణతనేని మణి నాయుడు ఆధ్వర్యంలో గురువారం నూకతోటి రాజేష్ జన్మదిన వేడుకలును నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద కేక్ కట్ చేసి స్వీట్స్ పంచి పెట్టారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.మణి నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, యువ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్యవేడు:

తిరుపతి జిల్లా, సత్యవేడులో వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ జన్మదిన వేడుకలను గురువారం స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. వైయస్ఆర్ విగ్రహం వద్ద మండల నాయకులు కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల రమేష్, మండల మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, దయాలం, గోపాల్ రెడ్డి, రవి, శీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణారావుకు సన్మానం


డాక్టర్ కృష్ణారావును సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, వాకాడు మండల పశు వైద్యాధికారి డా. సిహెచ్.ఎస్.కృష్ణారావుని బాలి రెడ్డి పాలెం వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పశువైద్యశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కోరారు. తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థుల స్టైఫండ్ పెంచాలని చేస్తున్న నిరసనకు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయపు రవి(మొలగనూరు), కుదురు రమేష్, సుబ్రహ్మణ్యం, రోషిని, కావ్య చందన, లక్ష్మి లు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ బీమాతో కుటుంబానికి భరోసా

సత్యవేడు స్టేట్ బ్యాంక్ మేనేజర్ వాకాటి హరీష్



ప్రజాశక్తి - సత్యవేడు: భారతీయ స్టేట్ బ్యాంకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీతో కుంటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందని సత్యవేడు స్టేట్ బ్యాంక్ మేనేజర్ వాకాటి హరీష్ పేర్కొన్నారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి 2000 రూపాయలు ప్రీమియం చెల్లించి, ప్రమాద బీమా పాలసీ తీసుకుంటే 40 లక్షల రూపాయలు భీమా చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ పాలసీ తీసుకోవడానికి వయస్సు 18 నుంచి 70 ఏళ్ల లోపువారు అర్హులన్నారు. ప్రీమియం వంద రూపాయలు చెల్లించి, రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా పొందే అవకాశం కూడా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రాథమిక దశలోనే చూపు లోపాన్ని గుర్తించాలి


విద్యార్థినికి కళ్లద్దాలు ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా): ప్రభుత్వం విద్యార్థుల కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, లోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులు నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలకు సుమారు 178 కంటి అద్దాలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, సర్పంచ్ కేజీ శారదమ్మ, గణేషన్, ఉపసర్పంచ్ జిల్లా కంటి వైద్య అధికారి మధుబాబు, స్థానిక డాక్టర్ దర్శిత్ రాజ్, ఎంపీడీఓ గుణశేఖర్, డిప్యూటీ డీఈవో ప్రభాకర్ రాజు, స్థానిక నాయకులు శివకుమార్, దొర రాజ్, ఉపాధ్యాయులు, వైద్య బృందం పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఎంపిక ప్రక్రియ



ప్రజాశక్తి - పిచ్చా టూరు: బీసీ కార్పొరేషన్ రుణాల ఎంపిక ప్రక్రియ నేడు ప్రారంభమవుతుందని ఎంపీడీవో మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బ్యాంకుల ద్వారా 34 యూనిట్‌లు రుణ సదుపాయం పొందే అవకాశం ఉందన్నారు. 167 దరఖాస్తులు అందాయన్నారు. ఈ రోజు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉదయం 10:30 గంటల నుండి బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాన్ కార్డ్, బ్యాంకు పాస్ బుక్ ఒరిజినల్స్‌తో హాజరు కావాలన్నారు.

'మా స్థలాలను మాకు ఇప్పించండి'

తిరుపతి(మంగళం): స్వాతంత్ర్య సమరయోధుల వారసులుగా ఉన్న తమకు 1992లో అప్పటి ప్రభుత్వం తిరుపతి చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా 173/3 లో 40 మందికి ఒక్కొక్కరికి నాలుగు సెంట్లు చొప్పున ఎ2.50సెంట్లు భూమి కేటాయించిందని, ఈ భూమిలో 2021లో కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేశారని రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో భూ బాధితులు మాట్లాడారు. ఈ సమస్యకు సంబంధించి ఇప్పటివరకు అధికారులను కలిసి ఎన్నోసార్లు వినతులు ఇచ్చామన్నారు. మా స్థలాలను మాకు ఇప్పించాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బాబురెడ్డి, శివప్రసాద్, వెంకటరామయ్య పాల్గొన్నారు.

24న 'కిల్ గేమ్ స్టార్ట్' చిత్రం విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) సమాజంలో మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంచేలా 'కిల్ గేమ్ స్టార్ట్' చిత్రాన్ని నిర్మించామని నటి, నిర్మాత శీలా లోకనాథం తెలిపారు. గురువారం ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ను తిరుపతి ప్రెస్ క్లబ్లో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా శీలా లోకనాథం మాట్లాడుతూ అరగంట నిడివితో సాగే ఈ చిత్రంలో పోలీసు అధికారిని పాత్రను పోషించానని, క్రైమ్ థ్రిల్లర్ గా ఈ చిత్రం ప్రేక్షకులను ఆదరిస్తుందని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ఎస్.కె దర్బార్, హరి, కవిత, మనోజ్, విల్సన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శీలా లోకనాథం

మా పొలాన్ని ఆక్రమించాడు: శంకర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మా పిత్రార్జితంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటుంటే అక్రమంగా ఆన్లైన్లో తమ భూమిపై తన పేరును ఎక్కించుకుని, పాసుబుక్కు పొంది దౌర్జన్యంగా భాను కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడని రామచంద్రాపురం మండలం దిగువ రామాపురం గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దిగువ రామాపురం గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 188/4 లో తమ పిత్రార్జితంగా మూడు ఎకరాల 65 సెంట్లు భూమి ఉందన్నారు. దీనిని తాను సాగు చేసుకుంటూ ఉన్నానని, గత మూడు నెలలుగా ఆన్లైన్లో తన పేరు ఉందని చెబుతూ కొంతమందిని కూడగట్టుకుని భాను కుమార్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమికి సంబంధించి అధికారులు ఆన్లైన్ లో తన పేరును నమోదు చేసి, దౌర్జన్యానికి పాల్పడుతూ పొలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శంకర్ రెడ్డి ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరారు.

రానున్నవి కాంగ్రెస్ రోజులే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశంలో ఇకపై రానున్నవి కాంగ్రెస్ రోజులేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి నేతల పాలన చూసి ప్రజలు విసిగి వేసారిపోయారని తెలిపారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. దానికి తగ్గట్లుగా పార్టీ శ్రేణులు కష్టపడి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రజా పోరాటాలు చేయడం ద్వారా పార్టీకి తిరిగి జవసత్వాలు రావడం ఖాయమని తెలిపారు. అనంతరం నియోజకవర్గ కమిటీలో చోటు సాధించిన పలువురుకి నియామక పత్రాలు అందజేశారు. నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిందర్, ఉపాధ్యక్షులు శబరి, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరీముల్లా, ఓబీసీ సెల్ చైర్మన్ భాస్కర్, కేకేసి చైర్మన్ చిరంజీవి, ఎస్టీ సెల్ చైర్మన్ నాయక్, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ చెరుకు తోట, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు జె సురేందర్ రెడ్డి, రహంతుల్లా, బాబు, ఫక్రుద్దీన్, జూమ్లేష, మహమ్మద్ ఉమర్, అల్తాఫ్, సలీం, సహమీర్, కరీముల్లా, యానాది నవీన్ కుమార్, నరసింహులు, గుణశేఖర్, బాబు, చందు, అజిత్, నాగరాజు, అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

త్వరలో అందుబాటులోకి రేడియేషన్ మిషన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి: త్వరలో తిరుమల తిరుపతి దేవస్థానములు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సౌజన్యంతో దాదాపు 20 కోట్ల రూపాయలు విలువచేసే రేడియేషన్ మిషన్‌ను స్విమ్స్‌కు అందజేయనున్నారని, ఇది త్వరలో అందుబాటులోకి రానుంది. స్విమ్స్ రేడియేషన్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'బ్రాకి థెరపి ది సర్జికల్ బ్రాంచి ఆఫ్ రేడియేషన్ అంకాలజీ' అంశంపై పద్మావతి ఆడిటోరియంలో ఏడవ వార్షిక చైర్ ఒరేషన్ జరిగిందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ముఖ్య అతిథిగా హర్యానా ఫరిదాబాద్ సర్వోదయ ఆస్పత్రి సంబంధించిన అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్‌కుమార్, స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభిం చారు. వైద్య విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వైద్య పరిజ్ఞా నాన్ని పెంచుకోవచ్చన్నారు. బ్రాకీ థెరపీ గురించి డాక్టర్ అశోక్‌కుమార్ వివరించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

23న జీతెలుగు డ్రామా జూనియర్స్ ఆడిషన్స్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుండే ఛానల్ జీ తెలుగు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి బుల్లితెరపై మెరిసే అవకాశం కల్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న సక్సెస్ఫుల్ షో డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 8 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 7 సీజన్‌లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రతిభగల పిల్లలని ఆడిషన్స్కి ఆహ్వానిస్తోంది. - డ్రామా జూనియర్స్ సీజన్ 8 కోసం తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులకు అద్భుత అవకాశం అందిస్తోంది. 4 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కని అవకాశం అందిస్తోంది. ఈ ఆడిషన్స్ ఆదివారం (ఫిబ్రవరి 23న) రోజు, హోటల్ పిఎల్ఆర్ గ్రాండ్, జయశ్యామ్ రోడ్, సెంట్రల్ బస్టాండ్ వెనక, టాటా నగర్, తిరుపతి నందు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించబడతాయి. ఏవైనా సందేహాలు ఉంటే 9032581717 నెంబర్కి కాల్ చేయవచ్చు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవ సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజుల ఆదేశాలతో గురువారం వడమలపేట క్లస్టర్ సీతారామాపురంలో ఉచిత వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డి కుమారి, మహేంద్ర, అమరావతి, రాస్ సిబ్బంది తేజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - నాయుడుపేట: ఇంటి బయట కూర్చుని ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్ళిన ఘటన నాయుడుపేట, పిచ్చిరెడ్డితోపులో గురువారం చోటుచేసుకుంది. బైక్‌పై వచ్చిన దుండగుడు వృద్ధురాలు జయమ్మ మెడలో గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ బాబి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలియజేశారు.

గ్రామాలకు రోడ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో పక్కా రోడ్లు నిర్మించడమే ఎన్‌డిఏ ప్రభుత్వ లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. గురువారం ఆమె దొరవారిసత్రం మండల పరిధిలోని, ఉచ్చూరు గ్రామపంచాయతి, తిమ్మినాయిడి కండ్రిగ గ్రామం నుండి ఉచ్చూరు వరకు1500 మీటర్ల వరకు బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అంగ న్వాడి కేంద్రం, సురక్షితమైన మంచినీటి సరఫరా వంటి వసతులు ఏర్పాటు చేయాలని కోరడంతో, అధికారులతో చర్చించి తగు చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమురు సుధాకర్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ వేమసాని శ్రీనివాసులు నాయుడు, తెలుగుదేశం మండల నాయకులు ఇట్లగుంట రత్నయ్య, బందిల ఉదయ్ కుమార్, విజయ్, నాగయ్య నాయుడు, మహిళా నాయకురాలు ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలో మహిళా హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినిలు బుధవారం రాత్రి హాస్టల్ వెలుపలకు వచ్చి నిరసన తెలిపారు. వర్సిటీ అధికారులు స్పందించక పోవడంతో హాస్టల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన ఆహారం అందించాలని, హాస్టల్ పరిసరాలలో శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం ఉదయం 11 గంటలకు విద్యార్థినిలు, విద్యార్థి సంఘ నాయకులు యూనివర్సిటీ ఎడి బిల్డింగ్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఏడి బిల్డింగ్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

డ్రోన్లతో దోమల నివారణ

ప్రజాశక్తి - నాయుడుపేట: గురువారం నాయుడుపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ షేక్ పజిల్లుల్లా ఆధ్వర్యంలో చేపట్టిన డ్రోన్లతో దోమల మందు పిచికారి చేసే కార్యక్రమాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూళూ రుపేట నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ 786 షేక్ రఫీ, టిడిపి సీనియర్ నాయకులు గూడూ రు సుధీర్ రెడ్డి,అవధానంసుధీర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాయితీ రుణాల దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం కార్పొరేషన్ల రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం బ్యాంక్ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 33 లోన్లు టార్గెట్‌గా ఇచ్చారని, వీటి కొరకు 588 మంది ఆన్లైన్లో అప్లై చేశారన్నారు.

క్రైం న్యూస్

తప్పిన ప్రమాదం


పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి-చిట్టమూరు: గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు కంపెనీ బస్సు నిడిగుర్తి నుంచి మాంబట్టు వెళుతూ, తెల్లవారు జామున వేగంగా వెళుతుండగా, కొత్తగుంట సమీపంలో రోడ్డుమీద గేదెలు గుంపుగా ఎదురువచ్చాయి. బస్సు కంట్రోల్ కాకపోవడంతో బస్సు గేదెల గుంపును ఢీకుంటూ పక్కనున్న పొలాల్లోకి దూసు కెళ్లింది. బస్సులో ఉన్న 30 మంది చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. ఈ ప్రమాదంలో ఒక గేదె మృత్యువాత పడింది. కంపెనీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని గేదల యజమాని కోరుతున్నారు. చిట్టమూరు ఎస్సై బలరామయ్య ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికుల బ్యాగులో నగలు చోరీ

రూ.12 లక్షల ఆభరణాలు స్వాధీనం


నేరస్తురాలి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి : ప్రయాణికుల బ్యాగుల్లో నగలు చోరీ చేస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని, ఆమె వద్ద నుంచి 12 లక్షల రూపాయలు విలువ చేసే 180 గ్రాములు బంగారు స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ డిఎస్పి శ్యాంసుందర్ తెలిపారు. స్థానిక క్రైమ్ టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం, నవోదయ కాలనీకి చెందిన ఎస్.స్వరూప రాణి (40) ప్రయాణికుల బ్యాగులో ఆభరణాలను చోరీలకు పాల్పడేదని తెలిపారు. ఈనెల 19వ తేదీ లక్ష్మీపురం సర్కిల్ నుంచి ఎంఆర్ పల్లి సర్కిల్‌కు ఆటోలో వెళుతూ పక్కనున్న ప్రయాణికుల వద్ద నుంచి నగలను చోరీ చేసిందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం ఉదయం ఇస్కాన్ మార్గంలో అనుమానస్పదంగా తిరుగుతున్న నిందితురాలిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐలు చిన్న పెద్దయ్య, శివ కుమార్ రెడ్డి, ప్రకాష్ కుమార్, ఎస్సై సుభాన్ నాయక్, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతి కార్యాలయము, రేణిగుంట.

రె.క.నెం: 17/2024. తేది: 18-02-2025.

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా, 2025-26 సంవత్సరమునకు అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు రేణిగుంట గ్రామ పంచాయతికి చెందిన 1) వారపు సంత 2) దినసరి కూరగాయల మార్కెట్లు 3) బస్టాపు (లోడింగ్/ అన్లోడింగ్)లకు రుసుములు వసూలు చేసుకొను హక్కును మరియు 1) గాంధీ మండపము ప్రక్కన 03 రూములు. 2) ఏ. పి. యస్. ఆర్. టి. సి. బస్టాండు వద్ద నిర్మించిన 08 రూములు 3) పోస్టాఫీసు ఎదురుగా నిర్మించిన 04 రూములను బహిరంగ వేలము వేయుటకు 28-02-2025వ తేదీన శుక్రవారము ఉదయం 10.00 గంటలకు రేణిగుంట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణములో పంచాయతి కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము వేయబడును. వేలము నందు పాల్గొను వారు ఈ క్రింది తెలిసిన వివరముల మేరకు దరావత్తు మరియు సాల్వెన్సి హాజరుపరచి వేలము నందు పాల్గొనవలెను.

క్ర. సం.	గుత్త వివరములు	సాల్వేన్సీగాని ఇంటి వాల్యువేషన్‌గానీ వున్న వారు చెల్లించవలసిన దరావత్తు	సాల్వేన్సీగాని ఇంటి వాల్యువేషన్‌గానీ లేనివారు చెల్లించవలసిన దరావత్తు	సాల్వేన్సీగాని ఇంటి వాల్యువేషన్‌గానీ సర్టిఫికేట్ పొందవల్సిన మొత్తం	కాల పరిమితి
1.	వారపు సంత	700000.00	1000000.00	1200000.00	01.04.2025 నుండి 31.03.2026
2.	దినసరి కూరగాయలు మార్కెట్	600000.00	800000.00	1000000.00	01.04.2025 నుండి 31.03.2026
3.	బస్టాపు (లోడింగ్/అన్‌లోడింగ్ ఏ.పి.యస్.ఆర్.టి.సి, ఓ.పి.టూరిజం,ప్రభుత్వ వాహనములు, వైట్‌బోర్డు వాహనములకు, రుసుము మినహాయించడమైనది)	600000.00	800000.00	1000000.00	01.04.2025 నుండి 31.03.2026
4.	గాంధీమండపము ప్రక్క రూము 03, (ఒక్కొకటికి) గమనిక: 02వ రూము నాయీ బ్రాహ్మణులకు) (రూమునెం.03ను డ్వాక్రా మహిళలకు కేటాయించబడినది)	600000.00	800000.00	1000000.00	01.04.2025 నుండి 31.03.2026
5.	ఏ.పి.యస్.ఆర్.టి.సి. బస్టాండ్ వద్ద నూతనముగా నిర్మించిన 08 రూములు (గమనిక: 07వ రూము యస్.సి.కులమునకు కేటాయించబడినది)	650000.00	150000.00	200000.00	01.04.2025 నుండి 31.03.2026
6.	పోస్టాపీసు ఎదురుగా రూములు - 04 (03 రూములు పొడవు×వెడల్పు=28.6" అ× 8.08 అ)	650000.00	150000.00	200000.00	01.04.2025 నుండి 31.03.2026
	01 రూము పొడవు×వెడల్పు=12" అ×6.09" అ (మెట్ల క్రింద కలవు)	40000.00	75000.00	100000.00	

వేలుపు షరతులు : 1) వేలము నందు పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయతికి ఎలాంటి బాకీలు ఉండరాదు. 2) వేలము దరావత్తు చెల్లించని వారు వేలములో పాల్గొనుటకు అనర్హులు, 3) శ్రీ జిల్లా పంచాయతి అధికారి సర్కులర్ నెం. 3/2003 ఎ5 (పం) తేది: 03-02-2003 నందు 2021-22 సంవత్సరమునకు లీజులు నందు పాటించవలసిన సూచనల మేరకు హెచ్చుపాటగా నిలిచిన గుత్తాదారుడు హెచ్చుపాట పూర్తి మొత్తమును (07) ఏడు రోజుల లోపల చెల్లించవలెయును. అట్లు చెల్లించని యెడల చెల్లించిన దరావత్తు మొత్తము గ్రామ పంచాయతికి దండుగ క్రింద బమ చేసుకొని రెండవ పాట దారునికి అదే నిబంధనలతో ఖాయపరచబడును లేక మరు వేలము వేయబడును. 4) వేలము షరతులకు బద్దులైన వారు మాత్రమే వేలములో పాల్గొనవలెను. 5) గుత్తదారుడు తన సొంత ఖర్చుతో రూ. 100/-లు స్టాంపు నందు స్థిరాస్తులు కలిగియున్న వారు ఒక్కొక్క పూచీ కత్తుతో రేణిగుంట గ్రామ పంచాయత్ కార్యదర్శి వారి పేరిట అగ్రిమెంటు వ్రాసి సబ్ రిజిస్టారు రేణిగుంట వారి కార్యాలయమున రిజిస్టరు చేసి ఇవ్వవలెయును. 6) వేలము పంచాయతీ కార్యదర్శిగాని, లేక వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. 7) వేలము రద్దు పరచుటకు గాని లేక వాయిదా వేయుటకు గాని వేలము వేయు అధికారికి అధికారము కలదు. 8) సాల్వెన్సీ సర్టిఫికేట్ పొందిన వారు వేలము పాటలో వారే నేరులో వేలములో పాల్గొనవలెయును. వారి తరపున ఇతర వ్యక్తులు వేలము పాటలో అనుమతించబడరు. 9) మిగతా వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును. 10) వేలపు పాట మొత్తమునకు వేలపు పాటదారుడు 2% శాతము అదనపు స్టాంపు డ్యూటీ చెల్లించవలెయును, 11) వేలపు పాట మొత్తమునకు వేలపు పాటదారుడు 18. % శాతము అదనపు జి. యస్. టి. (G.S.T.) చెల్లించవలెయును. 12) గ్రామ పంచాయతి కార్యదర్శి జారీ చేసిన డిక్లరేషన్ దరఖాస్తును వేలము నందు. పాల్గొను వేలం పాటదారుల పూర్తి వివరములు ధృవపత్రము నందు నింపి పంచాయతి కార్యదర్శి వారికి వేలపు పాటనకు ముందుగా సమర్పించవలెను. జట్లు డిక్లరేషన్ దరఖాస్తు సమర్పించని వారు వేలము పాటనకు అర్హులు కారు. 13) ప్రభుత్వ పరముగా అమలులో వున్న పన్నులు చెల్లించవలసివుండును.

గమనిక : 1) వేలము పాటలో పాల్గొను వారు దరావత్తు మొత్తమును SBI, Settipalli నందు చెల్లుబాటు అయ్యే విధముగా D. D. రూపమున పంచాయతి కార్యదర్శి, గ్రామ పంచాయతీ, రేణిగుంట పేరు మీద తీసి వేలపు పాటలో పాల్గొనవలెయును. నగదు స్వీకరించబడదని తెలియజేయడమైనది.
2) రూములు కేటాయించబడిన మేరకు వేలము నందు పాల్గొను సమయము నందు డ్వాక్రా గ్రూపుకు సంబందించిన ధృవపత్రము మరియు కులమునకు సంబందించిన ధృవపత్రము సమర్పించవలెయును.

శ్రీ పి. యన్. మణి.
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతి రేణిగుంట

శ్రీ ఆర్. నగేషం
సర్పంచు
గ్రామ పంచాయతి రేణిగుంట

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE PUTTUR
I.A.No.1498/2019, I.A.No.673/2019
O.S.No.135/2019

Between
A. Renuka Devi ...Petitioner/Plaintiff
And
K. Doraswamy Chowdary & Others ....Respondents/Defendants

NOTICE TO THE RESPONDENT NO.5

R5:
K. Narendra Sai, S/o K. Doraswamy Chowdary, Residing at Kammakandriga village, Ramachandrapuram Mandal, Tirupati District.

Please take notice that, the Petitioner/Plaintiff filed the suit for diclaration and permanent injuction against the respondents. In the above case the petitioner/plaintiff filed above petition to implead as proposed parties as against you and other person before this Hon'ble court, and the above petition (case) is posted to 12.03.2025 for your appearance, So please to be attend on 12.03.2025 at 10.30 A.M before the above Hon'ble Court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.

By order of the Hon'ble Court
M. Vidya Sagar
Advocate, Tirupati, 9985624066.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE PUTTUR
I.A.No.1614/2019,
O.S.No.135/2019

Between
A. Renuka Devi ...Petitioner/Plaintiff
And
K. Doraswamy Chowdary & Others ....Respondents/Defendants

NOTICE TO THE RESPONDENT NO.5

R5:
K. Narendra Sai,
S/o K. Doraswamy Chowdary,
Residing at Kammakandriga Village,
Ramachandrapuram Mandal,
Tirupati District.

Please take notice that, the above case posted to 12.3.2025 for your apperance. You shall appear on 12.3.2025 at 10.30 A.m before the above said court either in person or through your advocate if you failed to so the case will be decided in your absence.

By order of the Hon'ble Court
M. Vidya Sagar
Advocate, Tirupati,
9985624066.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE PUTTUR
I.A.No.1615/2019,
O.S.No.135/2019

Between
A. Renuka Devi ...Petitioner/Plaintiff
And
K. Doraswamy Chowdary & Others ....Respondents/Defendants

NOTICE TO THE RESPONDENT NO.5

R5:
K. Narendra Sai,
S/o K. Doraswamy Chowdary,
Residing at Kammakandriga Village,
Ramachandrapuram Mandal,
Tirupati District.

Please take notice that, the above case posted to 12.3.2025 for your apperance. You shall appear on 12.3.2025 at 10.30 A.M before the above said court either in person or through your advocate if you failed to so the case will be decided in your absence.

By order of the Hon'ble Court
M. Vidya Sagar
Advocate, Tirupati,
9985624066.

తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ సూచించారు. ఆమె గురువారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపిడీవో గోవర్ధన్, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, సిడిపిఓ శారదాంబ, డాక్టర్ చైతన్య, పలు శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో మంటలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మేల్చూరు, కోటంబేడు మధ్య మేల్చూరు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. మంటలు చెలరేగి అటవీ ప్రాంతం నుండి పక్కన్న పొలాలకు కూడా అగ్ని కీలలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

టైలర్ల సంక్షేమానికి కట్టుబడి ఉంటా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టైలర్ల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యేని కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేసి పలు హామీలను ఇచ్చారు. అధ్యక్షులుగా తొట్టంబేడు బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ మౌల, గౌరవ అధ్యక్షులుగా అమర్నాథ్, ఉపాధ్యక్షులుగా బాబు ఖాన్, మూర్తి, రేవతి, జే సురేష్, కుమార్, కార్యదర్శులుగా యస్ కే జాకీర్, ధనుంజయలు, యతి రాజు, అనుషా, శ్రీమతి లక్ష్మీ, సభ్యులుగా సురేష్, మునెంద్ర, యస్ రఫీ, యస్ మస్తాన్, కరిముల్లా, రాం బత్తియ్య, మదు, అర్ పల్లవి, గిరిజ ఎన్నికయ్యారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, పోలూరు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో కలిసి పనిచేద్దాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అందరూ సమన్వయంతో కలిసి పనిచేద్దామని, ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటానని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీ టీడీపీ విస్తృత సమావేశం పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్‌ల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలువురు పట్టణంలోని సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయన స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీసీఆర్ యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ ఎస్ ప్రతాప్ రాజు, పి ఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఆర్ మాధవ నాయుడు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ ప్రగతిలో ఘనంగా ఫుడ్ ఫియెస్టా 2025

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ఫుడ్ ఫియస్టా 2025 కార్యక్రమాన్ని కోట ఎస్ఐ పవన్ కుమార్ చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్‌తో కలిసి సందర్శించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఇంత శ్రద్ధ చూపిస్తున్న చైర్మన్ పసుపులేటి కిషోర్‌ని, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

వ్యాయామం ఆరోగ్యానికి దివ్య ఔషధం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వ్యాయామాలు మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి దివ్య ఔషధాలని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. శ్రీకాళహస్తిలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న నేషనల్ సీనియర్ సిటిజన్స్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవానికి గురువారం మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, ముని రామయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొని జాతీయ సీనియర్స్ టెన్నిస్ పోటీల్లో విశేష ప్రతిభ చూపిన విజేతలకు బహుమతుల ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.

రేషన్ సక్రమంగా అందజేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతి నెల నిత్యవసర సరుకులు సక్రమంగా లబ్దిదారులకు అందించాలని పుత్తూరు మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక పురపాలక కార్యాలయం పుత్తూరు పౌరసరఫరాల విషయమై తహశీల్దారు వెంకటేశ్వర్ అధ్యక్షతన చౌకదుకాణ డీలర్లకు, ఎం డి యు వాహనదారులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దారు ఎం అశోక్ రెడ్డి, గోడౌన్ డిప్యూటీ తహశీల్దారు ముని వేలు పిళ్లై, సీనియర్ అసిస్టెంట్ జి.గురుస్వామి, డీలర్లు, ఎండియు వాహనదారులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎంజిఎంకు ఈఎస్ఐ అనుమతి ఇవ్వండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక ఎంజీఎం ఆస్పత్రికి ఈఎస్ఐ అనుమతినివ్వాలని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుద్లూరు మయూర్ గురువారం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రి వాసంశెట్టిని విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసిన మయూర్ ఎంజీఎంకు ఈఎస్ఐ అనుమతి ఎందుకు అవసరమో వివరించారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో సుమారు 30 పరిశ్రమల ద్వారా 20వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి అత్యున్నత వైద్యం అందించేందుకు ఎంజీఎంకు ఈఎస్ఐ అనుమతి ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. స్పందించిన కేంద్రమంత్రి తప్పకుండా అనుమతులు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా నేదురుమల్లి జనార్దన్ రెడ్డి జయంతి

ప్రజాశక్తి - కోట : నేదురుమల్లి జనార్దన్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి జనార్దన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి బంధువులు, అభిమానులు, స్నేహితులు ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరీగ మురళి, ఎల్లసరి గోపాల్ రెడ్డి, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, దేవారెడ్డి నాగు రెడ్డి, వేమారెడ్డి షనీల్ కుమార్ రెడ్డి, ఎన్బికెఆర్ ఐ ఎస్ టి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్ కుమార్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఎన్.బి.కె.ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోట ఆర్టీసీ కార్గో పార్శిల్‌లో అధిక వసూళ్లు

ప్రజాశక్తి -కోట : కోట మండలం, స్థానిక ఏపీఎస్ఆర్టీసీ పార్సిళ్ల పంపేందుకు అధిక మొత్తంలో నిర్వాహకులు వసూలు చేస్తున్నట్లు ఆర్టిసి డిఎం కు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. గత ఐదు నెలల నుండి కోట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టిసి కార్గో సేవలు అందిస్తున్నారు. అయితే ఎల్ ఆర్ బుక్ చేసినప్పుడు, పార్సిళ్లను తీసుకునేటప్పుడు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారని పనబాక కోటేశ్వరరావు తెలిపారు. అధిక మొత్తం వసూలు చేస్తున్న వారిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

వ్యాపార దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మార్కెట్‌లలో విక్రయించే కొలతలు,బరువులు,ధరల లెక్కింపులో ఏవైనా అక్రమాలు జరుగుతున్నాయా అని పరిశీలించారు.ఈ తనిఖీల్లో పలు దుకాణాలు,వ్యాపార సముదాయాల్లో బరువులు, కొలతల పరికరాలను పరిశీలించగా,కొన్ని చోట్ల అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు.కొన్ని వ్యాపార సంస్థలు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని తేలింది.దీని నేపథ్యంలో కొన్ని వ్యాపారులపై కేసులు నమోదు చేసి,జరిమానా విధించి, సంబంధిత వారిని హెచ్చరించారు.ప్రజలు కొనుగోలు చేసే వస్తువులపై సరైన కొలతలు,బరువులు పాటించకుండా మోసపూరిత వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయ్ కుమార్ తెలిపారు.

చిన్నారుల్లో జ్ఞానజ్యోతిని వెలిగిద్దాం

ప్రజాశక్తి -కోట : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి జ్ఞానమనే జ్యోతిని వెలిగించడం ద్వారా భావి భారతంలో అత్యుత్తమ పౌరులుగా తీర్చి దిద్దుదామని అంగన్వాడి సిడిపిఓ ముని కుమారి సూపర్వైజర్ కవితలు అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని కోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులలో అంగన్వాడి సిడిపిఓ మణికుమారి సమక్షంలో సూపర్వైజర్ కవిత అంగన్వాడీలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీలోని చిన్నారుల అభ్యున్నతి కోసం గ్రామాల్లో త్వరలో ప్రారంభమయ్యే ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటు జరుగుతుందన్నారు. చిన్నారులకు బాల్య దశ నుంచే అల్లారు ముద్దుగా పెంచి చక్కని విద్యను బోధించే అవకాశం అంగన్వాడీ లకు దక్కుతుందని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి,రూప, తదితర అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో ఖాళీలను భర్తీ చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎల్. ఐ.సిలో ఖాళీగా ఉన్న క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి శివ కుమార్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఎల్.ఐ. సి కార్యాలయం వద్ద అసోసియేషన్ పిలుపు మేరకు ఎల్. ఐ.సి ఉద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు శివ కుమార్ మాట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు ఖాళీగా ఉన్న క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మనోజ్, నాగరాజు, అశోక్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ2 వేలతో 40లక్షల ప్రమాద బీమా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని విస్తరించింది. ఏడాదికి రెండు వేల రూపాయలతో 40 లక్షల రూపాయల ప్రమాద బీమా పొందవచ్చని గూడూరు ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రీమియం వంద రూపాయలతో రెండు లక్షల మొదలుకొని గరిష్టంగా రెండు వేలకు 40 లక్షలు బీమా పొందవచ్చని తెలిపారు.18 ఏళ్ల నుండి 70 ఏళ్ల వయసు వరకు ఎవరైనా బీమా చేయించుకోవచ్చ న్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా, సత్యవేడులో 8 కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తులకు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్ర మధురై రామలింగయ్య వీధికి చెందిన బాలమురుగన్ (43) వైజాగ్ నుంచి గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు మీదుగా చెన్నైకి వెళుతుండగా స్థానిక రాష్ట్ర సరిహద్దులోని మాధర పాకం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అతడిని పట్టుకున్నారు. బాలమురుగన్ ఎర్రటి బ్యాగ్‌లో గంజాయిని పెట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా బ్యాగ్‌లో ఉన్న గంజాయి బయటపడింది. దీంతో అతని అదుపులో తీసుకుని అతని దగ్గర ఉన్న 80,000 రూపాయలు విలువ కలిగిన ఎనిమిది కిలోల గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా పట్టుబడ్డ నిందితుడు బాలమురుగన్‌పై వైజాగ్ పోలీస్ స్టేషన్లో కేసులు కూడా ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆప్కాస్ రద్దు చేయొద్దు.. మంత్రికి వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆప్కాస్ రద్దు ఆలోచన తక్షణమే విరమించుకోవాల ని, జీవో నెంబర్ 2 సవరించి అందరికీ మినిమం టైమ్ స్కేలు వర్తింపజే యాలని, అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్‌కు వేతనం పెంచాలని, ఆరు నెలలు టెండర్లను రద్దు చేసి సంవత్సరం టెండర్ వెంటనే ఇవ్వాలని, హార్టికల్చర్ వర్కర్స్‌కు 549 రూపాయలకు వేతనం పెంచాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులు వినతి పత్రం ఇచ్చారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో జి. గంగయ్య, పి.బాబు, ఎస్.సుభాహన్, నందకుమార్, గురుకుమార్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఏపీ పీజీసెట్ ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని గురువారం ఎస్వీ యూనివర్సిటీ ఎడి బిల్డింగ్ ముందు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ తదితరులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్సిటీలో దశల వారి ఉద్యమాలు ప్రారంభిస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త బంద్ కూడా పిలుపునిస్తామన్నారు.

నేడు అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - చంద్రగిరి: అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి శుక్రవారం ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ప్రదీప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

'నిర్దేశిత గడువులోపు జీఎస్టీ చెల్లించాల్సిందే'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) ఆధ్యాత్మిక క్షేత్రంలో తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వసతి బస కల్పించే మఠాలు నిర్దేశిత గడువులోగా జీఎస్టీ చెల్లించాలని తిరుపతి సర్కిల్ సిటిఓ శ్రీనివాసులు నాయుడు స్పష్టం చేశారు. ఇటీవల తిరుమలకు సంబంధించి అక్కడి మఠాల నిర్వాహకులతో సమావేశం అనంతరం జీఎస్టీ చెల్లింపుపై తగిన సూచనలు చేశామన్నారు. యాత్రికులకు గది కేటాయింపుపై 12 శాతం, కళ్యాణ మండపం కేటాయింపు పై 20 శాతం, క్యాటరింగ్ పై 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. మఠం నిర్వాహకులు ఎవరైతే ఉన్నారో వారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకుని చెల్లింపులు జరపాలన్నారు. గతంలో జీఎస్టి రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా పన్ను ఎగవేతకు ప్రయత్నించినట్లుగా ఆరోపణలు రావడం పట్ల ప్రభుత్వ సిటి డిపార్ట్మెంట్ ప్రత్యేక చొరవ తీసుకొని మఠాలను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రతినెల 20వ తేదీ లోపు జీఎస్టీ చెల్లించని పక్షంలో వారిపై తగు చర్యలు తీసుకుంటామని శ్రీనివాసులు నాయుడు స్పష్టం చేశారు.

వాహన ఉద్గారాలు పరిమితిలోపు ఉండాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) వాహనాల ఉద్గారాలు పరిమితి లోపు ఉండేలా వాహన యజమానులు వాహనాలపై తగిన పర్యవేక్షణ చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళి మోహన్ సూచించారు. గురువారం తిరుపతి–కరకంబాడి మార్గంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జిల్లాలోని అన్ని వాహన కాలుష్య తనిఖీ కేంద్రాలకు సంబంధించిన యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. వాహనాలకు పియుసిసి సర్టిఫికెట్లు జారీ చేయునప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను తనిఖీ కేంద్రాల నిర్వహకులకు వివరించారు. కాలుష్య తనిఖీ కేంద్రాల క్యాలిబ్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల వివరాలను, వాహన వివరాలను విధిగా వాహన పోర్టల్ లో పొందుపరచాలన్నారు. మార్చి నెల 10వ తారీకు లోపు వివరాల నమోదు చేయాలని, లేని పక్షంలో వాహన కాలుష్య తనిఖీ కేంద్రాల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో కాలుష్యం ఎక్కువగా ఉన్న వాహనాలను తిరుమలకు అనుమతించకుండా, అట్టి వాహనాలకు అపరాధ రుసుమును విధించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ ఎంవిఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, ఏవో శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ చరణ్ చక్రవర్తి, పుత్తూరు ఎంవిఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుల గోడు వినండి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రభుత్వ ప్రజల సంక్షేమానికి ఎన్ని పథకాలు తీసుకువస్తున్నా, కొన్ని శాఖల నిర్లక్ష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతూనే ఉన్నారు. మండల పరిధిలోని కామకూరులో కిడ్నీ వ్యాధి బాధితులు గత కొన్ని సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకునే పరిస్థితితో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ఈ వ్యాధి బారిన పడి ఇప్పటికే కొందరు మృతి చెందగా, మరికొందరు డయాలసిస్ చేయించుకునే పరిస్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితికి గ్రామంలో తాగు నీరే కారణమని తెలుస్తోంది. అధికారులు కలుషిత నీటిని పంచాయతి ద్వారా అందిస్తుండగా, ఆ నీటిని తాగి ఈ పరిస్థితి వస్తోందని గ్రామస్తులు వాపోయారు. అటు పంచాయతీ సిబ్బందిగానీ, ఇటు ఆరోగ్య సిబ్బందిగానీ తమ గోడు పట్టించుకోవడం లేదన్నారు. డయాలసిస్ చేయించుకోవడానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడూరుకు వెళ్లాల్సి వస్తోందని తమ బాధను తెలుపుతున్నారు.ఇకనైనా నాయకులు, అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 3,4వ తరగతి ఉద్యోగాల నియామకాలు వెంటనే చేపట్టాలని, పుత్తూరు ఎల్ఐసి యూనియన్ కార్యదర్శి ఎన్ లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు స్థానిక ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు మధ్యాహ్నం 12:30 గంటల నుండి 01:30 వరకు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఎల్ఐసి లోని 3,4వ తరగతి ఉద్యోగుల నియామకం వెంటనే చేపట్టాలని, యూనియన్‌కు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా నిలచిన సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ వెంటనే ఎల్ఐసి సంస్థలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు డి.దస్తగిరి, ఇతర యూనియన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.